సాక్షి సంగారెడ్డి

మంగళవారం ౹ 12 ౹ డిసెంబర్ ౹ 2023



వణికిస్తోంది

చలి జనం గజగజ వణికిపోతున్నారు. కొన్ని రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి నుంచి రక్షించుకోవడానికి ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. వివరాలు 8లో ▸



కారులో చెలరేగిన మంటలు

వెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన వర్గల్ మండలం గౌరారం సమీపంలోని రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలు 8లో ▸



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జిన్నారం(పటాన్‌చెరు): అన్నారంలోని ప్రకృతి నివాస్‌లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలోని విద్యుత్ బస్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

• జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు



మాట్లాడుతున్న జడ్జి ప్రభాకరరావు

సంగారెడ్డి టౌన్: ఈ నెల 30న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు పిలుపునిచ్చారు. జిల్లా కోర్టులో పోలీస్ అధికారులతో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రిమినల్ కాంపౌండ్ కేసులను ఎక్కువ సంఖ్యలో పరిష్కరించాలని, కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సైబర్ ఏసీపీ నరసింహారావు, సంగారెడ్డి డీఎస్పీ రమేశ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా

• ఎమ్మెల్యే మాణిక్‌రావు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: అందరి సహకారంతోనే తాను ఎన్నికల్లో విజయం సాధించానని ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో శేఖాపూర్, ఖంజమల్‌పూర్ తదితర గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను సన్మానించారు. అందరిని కలుపుకుని ముందుకెళ్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

చిరాగ్‌పల్లి అధ్యక్షుడిగా జగన్నాథ్

చిరాగ్‌పల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా జగన్నాథ్ నియమితులయ్యారు. క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి పాల్గొన్నారు.

• వైభవంగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

మునిపల్లి(అందోల్): జీవన్ముక్త సంస్థాన ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు సోమవారం కనులపండువగా రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు పాండు రంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులతో పాటు జీవన్ముక్త మహారాజ్‌కు సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ శంకర్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సురేష్, ఏఎస్ఐ బిక్షపతి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆరోగ్య భరోసా



వట్‌పల్లి గ్రామ చౌరస్తా

- వట్‌పల్లిలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటుపై ఎన్నికల్లో దామోదర హామీ
- త్వరలో రాబోతుందని మంత్రి హోదాలో మరోసారి ప్రకటన
- ఆనందం వ్యక్తం చేస్తున్న మండల వాసులు

వట్‌పల్లి(అందోల్): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో ప్రజల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఆరు గ్యారంటీ పథకాలతో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అందోల్ కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన దామోదర రాజనర్సింహ.. ఎన్నికల ప్రచార సమయంలో పలు హామీలు గుప్పించారు. ప్రధానంగా కొత్తగా ఏర్పడిన వట్‌పల్లి మండలానికి 50 పడకల ఆస్పత్రిని తీసుకొస్తానని జోగిపేట కాంగ్రెస్ యువగర్జన సభలో హామీ ఇచ్చారు. దీంతో అదే మండలానికి చెందిన బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్‌ను కాదని ఓటర్లు కాంగ్రెస్ వైపు నిలిచారు. 2378 ఓట్ల మెజార్టీ అందించారు. దామోదర గెలుపొందడంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కావడంతో వట్‌పల్లిలో 50 పడకల ఆస్పత్రి ఏర్పాటుపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

దామోదర హయాంలో సబ్‌స్టేషన్

2009 ఎన్నికల్లో గెలిచిన దామోదర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అప్పుడు లో ఓల్టేజీ సమస్యను తీర్చాలనే ఉద్దేశంతో వట్‌పల్లి మండలంలో 133 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా అల్లాదుర్గం ఐబీ చౌరస్తా నుంచి మెటల్ కుంట వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కూడా దామోదర్ హయాంలోనే జరిగింది. ఆయన చొరవతోనే వట్‌పల్లిలో వ్యాపార సముదాయాలు వచ్చి దినదినాభివృద్ధి సాధించిందని స్థానికులు చర్చించుకుంటారు.

హామీకి ముందడుగు

ఎన్నికల ప్రచారంలో భాగంగా తనను గెలిపిస్తే వట్‌పల్లి మండల కేంద్రంలో ఆస్పత్రి ఏర్పాటు చేస్తానని దామోదర హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆయన గెలిచి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా పదవిని చేపట్టిన తర్వాత మొదటి సారిగా జోగిపేటకు వచ్చిన సందర్భంగా మాట్లాడారు. అందోల్ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ నెరవేర్చుకుందామన్నారు. అందులో ప్రత్యేకంగా వట్‌పల్లిలో 50 పడకల ఆస్పత్రి త్వరలో రాబోతుందని ప్రకటించారు. దీంతో ఆయన ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన మాటకు దామోదర కట్టుబడి ఉండటం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు మెరుగైన వైద్యం



వట్‌పల్లిలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. మండల ఏర్పాటై ఏడేళ్లు అయినా సరైన వైద్యం అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో మంత్రి దామోదర రాజనర్సింహ వట్‌పల్లిలో మార్కెట్‌యార్డు, విద్యుత్ సబ్‌స్టేషన్, డబుల్‌రోడ్డు వంటి అభివృద్ధి పనులు చేపట్టారు. నేడు 50 పడకల ఆసుపత్రి ఏర్పాటుచేస్తామని ప్రకటించడం సంతోషకరం.

– రమేశ్‌జ్యోషి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు

మండల ప్రజల హర్షం

నూతన మండలంగా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు వట్‌పల్లిలో ప్రభుత్వ వైద్య సేవలకు దూరంగా ఉండిపోవడంతో ఆర్ఎంపీ డాక్టర్లే దిక్కయ్యారు. అత్యవసర సమయాల్లో కనీసం అంబులెన్స్ వాహనం కూడా అందుబాటులో ఉండేది కాదు. ప్రభుత్వ వైద్య సేవల కోసం జోగిపేట, సంగారెడ్డి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర త్వరలో వట్‌పల్లిలో 50 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం పట్ల, ఇక ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుతో తనదైన ముద్ర

వట్‌పల్లిలో మార్కెట్ యార్డును ఏర్పాటు చేసి తనదైన ముద్రను వేశారు రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ. 2004 ఎన్నికల్లో గెలుపొందిన ఆయన.. మార్కెటింగ్, గిడ్డంగుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో అల్లాదుర్గం మండలం వట్‌పల్లి గ్రామంలో 2008లో కొత్తగా మార్కెట్ యార్డును ఏర్పాటు చేయించారు. 9 ఎకరాల 36 గుంటల విస్తీర్ణంలో 30 షెట్టర్‌లు, 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వల గోదాంలను నిర్మింపజేశారు. ఈ మార్కెట్ యార్డుకు తన తండ్రి దివంగత మంత్రి సి.రాజనర్సింహ పేరును పెట్టారు. మార్కెట్‌యార్డు ఏర్పాటుతో వట్‌పల్లికి నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు వచ్చింది.





ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శరత్

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్ : ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ శరత్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాధురితో కలిసి కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు. భూ సంబంధిత, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు, ఉద్యోగం చూపాలని, ట్రై సైకిల్స్, దివ్యాంగుల పింఛన్ అందజేయాలని అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో మొత్తం 27 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్ఓ నగేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

• గుమ్మడిదల మండలం నాగిరెడ్డి గూడెంకు చెందిన మహిళ తన భర్త పేరిట ఉన్న 5 ఎకరాల భూమిని తన పేరున మార్చాలని కోరుతూ అర్జీ అందజేశారు. కలెక్టర్ స్పందించి.. తహసీల్దార్‌కు ఫోన్ చేసి సమస్యపై చర్య తీసుకోవాలని సూచించారు.

• జహీరాబాద్ మండలం కొత్తూరు బి గ్రామానికి చెందిన దివ్యాంగుడు సంపత్ కుమార్ ఎస్సీ కార్పొరేషన్ లోన్ మంజూరయ్యేలా చూడాలని అర్జీ పెట్టుకున్నాడు.

• గొర్రెల యూనిట్ల పంపిణీ వేగవంతం చేయాలని పెంపకందారుల సంఘం మాజీ డైరెక్టర్ భూమయ్య వినతి పత్రం అందజేశారు.

కలెక్టర్ దంపతుల పూజలు

కార్తీక పౌర్ణమి చివరి సోమవారం పురస్కరించుకుని సోమేశ్వరవాడలోని శివాలయంలో కలెక్టర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కౌన్సిలర్ మంజులత నాగరాజ్ గౌడ్, పాల్గొన్నారు.

త్వరలో పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



విగ్రహ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు : పట్టణంలో బహుజనుల యుద్ధ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహాన్ని త్వరలో చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం సోమవారం సాకి చెరువు కట్టపై స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన సొంత ఖర్చుతో విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం గౌడ కులస్తులను పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో వారి సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ధన్ రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమలు తీరు పరిశీలన

మనూరు(నారాయణఖేడ్): నారాయణఖేడ్‌లో మహాలక్ష్మి పథకం అమలు తీరును ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ దైవాదీనం పరిశీలించారు. సోమవారం స్థానిక బస్‌స్టాండ్‌తోపాటు, రాజీవ్ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్న మహిళలతో ఆయన మాట్లాడారు. ఖేడ్ డివిజన్ పరిధిలో తిరుగుతున్న పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల వివరాలు, ప్రయాణికుల సంఖ్య తదితర అంశాలపై ఆరా తీశారు. ఆయన వెంట ఆర్టీసీ సీఐ నర్సింహులు, నెహ్రూ, శంకర్ ఉన్నారు.



ఖేడ్‌లో మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న దైవాదీనం

ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలి

ఎస్పీ రూపేష్



సంగారెడ్డి ఎక్స్‌రోడ్ వద్ద సూచనలు ఇస్తున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్పీ రూపేష్ సూచించారు. సోమవారం సంగారెడ్డి, పటాన్ చెరులో ప్రధాన ట్రాఫిక్ పాయింట్స్‌ను ఆయన సందర్శించారు. సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరు, జీబ్రా క్రాసింగ్ లైన్స్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. హైవే వెంట, లింక్ రోడ్డుల వద్ద సైన్ బోర్డులు ఉండేలా చూడాలని అన్నారు. ఏవైనా లోపాలున్నట్లైతే సంబంధిత అధికారులకు తెలియజేసి సవరించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్స్ సీట్ బెల్ట్ పెట్టుకోవాలని అన్నారు. ఆటోలను స్టాండ్‌లోనే నిలపాలన్నారు. స్పీడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్ చేయకుండా పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట అదనపు ఎస్పీ పి.అశోక్, ఎట్సీ ఇన్‌స్పెక్టర్ శివలింగం, సంగారెడ్డి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, పటాన్ చెరు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి ఉన్నారు.

కలిసి పనిచేద్దాం..

• మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేటజోన్: గత ప్రభుత్వానికి ఇచ్చిన సహకారాన్ని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులంతా కలిసి పనిచేద్దామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సోమవారం మంత్రి హోదాలో జిల్లాకు వచ్చిన ఆయనను సిద్దిపేట, సిరిసిల్ల జిల్లా టీఎన్జీఓ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా ఉద్యోగులు కష్టపడే మనస్తత్వం వారన్నారు. జిల్లాను ఆదర్శ జిల్లాగా మార్చడంలో మీ సహాయ సహకారాలు ఉండాలని సూచించారు. ఈ సందర్భం గా జిల్లా సంఘం అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

• కార్తీక శోభ



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

జిన్నారం(పటాన్‌చెరు): భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసంలో ఆఖరి సోమవారం కావడంతో స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు అధికసంఖ్యలో తరలివచ్చారు. అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు దీపాలను వెలిగించి మొక్కులను తీర్చుకున్నారు. దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఏ ఇబ్బందులు కలుగకుండా ఈఓ శశిధర్, నిర్వాహకులు సోమయ్య చర్యలు చేపట్టారు.

నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



చింతా ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

సంగారెడ్డి: నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటానని, వారి ఆర్థికాభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం సదాశివపేటలోని క్యాంప్ కార్యాలయంలో ఆయనను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చింతా మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు 250 యూనిట్ల ఉచిత కరెంటు అందించిన కేసీఆర్‌కు దక్కిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు లకుడారం మాణిక్ ప్రభు, మామిళ్ళ నాగభూషణం, దత్తాత్రేయ, శేఖర్, వీరభద్ర అంజయ్య, సత్యం, చేర్యాల ఆంజనేయులు, వీరన్న, గోపాల్, చరణ్, శ్రీశైలం, రాము, రాజు, నిరంజన్, సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం?

- ఆ పదవి కోసం పలువురి ప్రయత్నాలు
- మరో ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లోకి?
- జోగిపేటలో పాలకవర్గ మార్పుపై చర్చ



జోగిపేట(అందోల్): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో జిల్లాలోని మున్సిపాలిటీల్లో పాలకవర్గాల మార్పు దిశగా అడుగులు పడుతున్నాయి. సంవత్సరం క్రితం అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టి జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. అయితే అప్పట్లో చైర్మన్ కోర్టుకువెళ్లి స్టే తెచ్చుకున్నారు. మూడు నెలల క్రితం దానిని తొలగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

కౌన్సిలర్ల ఆశలు

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నాయకులు అటువైపు దృష్టి సారించారు. అందోల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దామోదర రాజనర్సింహకు మంత్రి పదవి రావడంతో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు చైర్మన్ పదవిపై ఆశలు పెంచుకున్నారు. ప్రస్తుతం జోగిపేట మున్సిపల్ చైర్మన్‌గా బీఆర్ఎస్ పార్టీకి చెందిన గూడెం మల్లయ్య, వైస్ చైర్మన్‌గా ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. మున్సిపాలిటీలో 20 మంది కౌన్సిలర్లు ఉండగా 13 మంది బీఆర్ఎస్ తరఫున గెలుపొందగా.. స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన నాగరాజు కూడా అప్పట్లో గులాబీ పార్టీలో చేరాడు. ఆరుగురు కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. గూడెం మల్లయ్యపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన 12 మంది కౌన్సిలర్లు అసమ్మతి తీర్మానం ప్రవేశపెట్టి సంతకాలు చేసిన ప్రతిని కలెక్టర్‌కు అందజేశారు. సంవత్సరం పాటు చైర్మన్‌పై వ్యతిరేకత చూపించారు. ఒకసారి కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించారు. ఎన్నికల సమయంలో అప్పటి ఎమ్మెల్యే క్రాంతికిరణ్ కౌన్సిలర్లలో ఉన్న అసంతృప్తిని తొలగించారు. కొంత కాలం కౌన్సిలర్లు కలిసి పనిచేసినా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్‌లు నాగరాజు, చందర్‌నాయక్, దుర్గేశ్ కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌కు చెందిన మరో ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నా చేర్చుకునేందుకు నాయకులు ఒప్పుకోలేదని తెలిసింది.

చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు?

జోగిపేట మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ప్రయత్నాలు మొదలు పెట్టారు. మొత్తం 20 వార్డులుండగా అందులో 11 మంది బీఆర్ఎస్, 9 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసం ఆమోదం పొందాలంటే మరో ఇద్దరు కౌన్సిలర్ల మద్దతు అవసరం. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతునిచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు సమాచారం. అవిశ్వాసం రోజున అవసరమైతే ఎక్స్‌అఫీషియో సభ్యుడి ఓటును మంత్రి దామోదర రాజనర్సింహ వినియోగించుకునే అవకాశం ఉంది. ఎంపీ బీబీ పాటిల్‌కు కూడా ఓటు వేయడానికి అవకాశం ఉంటుందని అంటున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు సైతం వార్డు అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉంది.

రేసులో సురేందర్‌గౌడ్, చిట్టిబాబు?

జోగిపేట మున్సిపాలిటీ బీసీ జనరల్ కావడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఆకుల చిట్టిబాబు, ఎస్.సురేందర్‌గౌడ్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నట్టు సమాచారం. మంత్రి దామోదర రాజనర్సింహ ఆశీస్సులు ఎవరికి ఉంటాయోనని పార్టీలో చర్చ జరుగుతోంది. ఏడాది కోసం ఈ ప్రయత్నాలు చేద్దామా? వద్దా అని కూడా కౌన్సిలర్లు మల్లగుల్లాలు పడుతున్నట్టు సమాచారం. మరో ఇద్దరు కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీలోకి రప్పిస్తే తప్ప చైర్మన్ పదవి దక్కే అవకాశం లేదు. పార్టీలో ఇప్పటికే ఎవరికి వారు పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అందోల్‌లో దామోదర ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి మున్సిపల్ పాలకవర్గం మార్పుపై చర్చ సాగుతోంది.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ మండలం దామరకుంట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. సోమవారం దామరకుంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట రాములు, ఉపాధ్యాయులు వారికి మెమోంటోలను అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024 జనవరిలో ఢిల్లీ లేదా రాజస్థాన్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇలాంటి అవకాశాలను మరిన్ని అందిపుచ్చుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నబ్రహ్మయ్య, రమేశ్, బాల్‌రెడ్డి, కేశవరెడ్డి, సుభాష్‌చంద్ర, రేఖ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్‌కు..

తొగుట(దుబ్బాక): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సయ్యద్ బాబా రాష్ట్ర స్థాయి అండర్ 14 వాలీబాల్ జట్టుకు ఎంపికై నట్టు పాఠశాల హెచ్‌ఎం ఉపేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. చదువులతోపాటు క్రీడల్లో రాణిస్తున్న సయ్యద్ బాబాను, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మురళీధర్‌ను హెచ్‌ఎం అభినందించారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు..



అక్షితతో పీటీ వెంకటస్వామి గౌడ్

సిద్దిపేటరూరల్: హనుమకొండలో మూడురోజులపాటు జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జెడ్పీహెచ్‌ఎస్ రాఘవాపూర్ పాఠశాలకు చెందిన అబ్బుల అక్షిత బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కర్రోల్ల వెంకటస్వామి గౌడ్ సోమవారం తెలిపారు. అండర్ -17 బాలికల విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. త్వరలో బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుభార్గవి, సర్పంచ్ రమేశ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి, చైర్మన్ కనకరాజు, ఉపాధ్యాయ బృందం అక్షిత, పీఈటీ వెంకటస్వామిని అభినందించారు.

యోగా పోటీలకు..



మనోజ్‌కుమార్

సిద్దిపేట ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జాతీయ స్థాయి యోగా పోటీలకు సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థి మనోజ్‌కుమార్ ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ రెడ్డి సోమ వారం తెలిపారు. సెకండర్ ఇయర్ చదువుతున్న మనోజ్ కుమార్ నల్గొండ జిల్లా మిర్యాలగూడలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 పోటీల్లో పాల్గొని నాలుగో స్థానం సాధించారన్నారు. డిసెంబర్ 19 నుంచి 21 వరకు కలకత్తాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

ఎర్ర సిరాతో మంత్రి సీతక్క చిత్రం



దుబ్బాక: ఇటీవల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చిత్రాన్ని దుబ్బాకకు చెందిన ప్రముఖ చిత్రకారుడు కాముని మల్లికార్జున్ ఎరుపు రంగు సిరాతో వేసి మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపారు.



సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉన్ని దుస్తులను కొంటున్న ప్రజలు

వణికిస్తోంది

చలి గుప్పిట ప్రజలు

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- మంచులో వాహనదారుల ఇబ్బందులు

మూడు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు	
శనివారం	14.05 డిగ్రీలు
ఆదివారం	13.01 డిగ్రీలు
సోమవారం	12.00 డిగ్రీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా ప్రజలను చలి వణికిస్తోంది. బంగాళఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాన్ కారణంగా కొద్ది రోజులుగా జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మధ్యాహ్నం కాస్త ఎండ కొడుతున్నా అంతంత మాత్రంగానే ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలు చలిగుప్పిట ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తీవ్రత నుంచి రక్షించుకోవడానికి ఉన్ని బట్టలు, స్వెట్టర్లు, మఫ్లర్లు, తలపాగాలు ధరిస్తున్నారు. జిల్లా కేంద్రంతోపాటు గజ్వేల్, చేర్యాల, దుబ్బాక, హుస్నాబాద్ పట్టణాలు, ప్రధాన రహదారుల వెంట శరీరాన్ని చలి నుంచి రక్షించే దుస్తులను రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వ్యాపారులు విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఉదయం, రాత్రి సమయల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు సైతం బెంబేలెత్తిపోతున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. నేడు 14 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతాయని చెబుతున్నారు.

8 తర్వాతే షాపునకు..



జిల్లా కేంద్రంలో జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాను. దుకాణం తెరవడానికి ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి బయలు దేరుతాను. కానీ వారంరోజులుగా ఉదయం 8 గంటలు అయినా ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే భయంగా ఉంది. అదే విధంగా రాత్రి 10 గంటలకు మూసివేసే షాపును 7 గంటలకే మూసి వేస్తున్నాను.

– మార్కండేయులు, సిద్దిపేట

బయటకు వెళ్లలేకపోతున్నాం



పది రోజులుగా చలి తీవ్రత పెరిగింది. దీంతో బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్నేళ్లుగా ఇంతటి చలి తీవ్రత ఎన్నడూ చూడలేదు. మంచు కారణంగా తెల్లారి 8 గంటలు అయినా సూర్యుడు కనిపించడం లేదు. ఉదయం, రాత్రి సమయల్లో అత్యవసర పని ఉంటేనే బయటకు వెళ్తున్నాం.

–అలేటి లింగం, వల్లంపట్ల

తక్షణమే కంచె ఏర్పాటు చేయండి

- ప్రాజెక్టులోకి డీసీఎం దూసుకెళ్లిన ఘటనపై స్పందించిన మంత్రి పొన్నం
- గూగుల్ మ్యాప్ నుంచి తొలగించేలా చూడాలని కలెక్టర్‌కు ఆదేశం

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టులోకి దూసుకెళ్లిన డీసీఎం వ్యాన్ అంటూ సాక్షిలో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్పందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జీవన్ పాటిల్‌కు ముంపు గుడాటిపల్లి గ్రామ రోడ్డును గూగుల్ మ్యాప్ నుంచి తొలగించాలని కోరుతూ గూగుల్ వారికి లేఖ రాయాలని, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నందారం స్టేజీ దాటాక గౌరవెల్లి ప్రాజెక్టు వైపు ఎవరూ వెళ్లకుండా పెద్ద కంచెను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



'నట్టేట ముంచిన గూగుల్ మ్యాప్' కథనం

సులభపద్ధతిలో బోధించాలి

రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ సెక్రెటరీ స్వర్ణలత



విద్యార్థులతో మాట్లాడుతున్న స్వర్ణలత

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ సెక్రెటరీ స్వర్ణలత అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం ముత్తంగి ప్రభుత్వ పాఠశాల, అదే విధంగా రుద్రారం ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంఈఓ పీపీ రాథోడ్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె తరగతి గదిలో తిరిగి విద్యార్థులతో చదివించడం, రాయించడం చేశారు. అధికారిని అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు జవాబులు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలకు వచ్చిన అక్షయపాత్ర భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంట్లోని నగదు, బంగారం చోరీ



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ

దుబ్బాకరూరల్: గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగులగొట్టి నగదు, బంగారం ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని రామక్కపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి యాజమాని బొడ్డుబాబు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని చీకోడ్ గ్రామంలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగుల గొట్టి అందులోని నగదు రూ.20 వేలు, బంగారం ఎత్తుకెళ్లారు. బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నగల షాపునకు రంధ్రం పెట్టి..



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

గజ్వేల్‌రూరల్: ఓ నగల దుకాణంలో చోరీ జరిగిన ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రజ్ఞాపూర్‌లో రోడ్డుపైన జెడ్పీహెచ్‌ఎస్ పక్కనగల ముఖేష్ అనే వ్యక్తికి చెందిన నగల దుకాణం ఉంది. దీని పక్కనే ఉన్న మరో దుకాణం గోడకు రంధ్రం చేసిన దుండగులు నగల దుకాణంలోకి చొరబడి సుమారు 6 కిలోలకు పైగా వెండి వస్తువులు దొంగిలించారు. విషయం తెలుసుకున్న దుకాణం నిర్వాహకుడు ముఖేష్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ వివరాలు సేకరించారు. సోమవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారులో చెలరేగిన మంటలు

- తప్పిన పెను ప్రమాదం
- సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు
- గౌరారం వద్ద రాజీవ్ రహదారిపై ఘటన



ప్రమాదంలో దగ్ధమవుతున్న కారు

వర్గల్(గజ్వేల్): డివైడర్‌ను దూసుకొని అవతలి వైపు వెళ్లిన కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తి దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం ఉదయం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం సమీపంలోని రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. గౌరారం పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఓబులాపూర్‌కు చెందిన వంగ భాస్కర్‌రెడ్డి హైదరాబాద్‌లోని మియాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయన భార్య లాస్య, కుమారుడు హయాన్‌రెడ్డి, బావమరిది మహిపాల్‌రెడ్డిలతో కలిసి తమ కారులో బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం జగదేవ్‌పూర్ మండలం తిగుల్ వచ్చాడు. సోమవారం ఉదయం కుటుంబసభ్యులతో కలిసి మియాపూర్‌కు వెళ్తుండగా గౌరారం సమీపంలో రాజీవ్ రహదారిపై ముందు వెళ్తున్న లారీ బ్రేక్ వేయడంతో కారు డ్రైవర్ సంపత్ స్టీరింగ్‌ను కుడివైపునకు తిప్పాడు. దీంతో కారు డివైడర్‌ను దాటేసి రెండోవైపు రోడ్డును దాటుతూ చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. అందులో ఉన్న వారు గమనించి దిగిపోగా, కారు పూర్తిగా దగ్ధమైంది. గౌరారం పోలీసులు ఘటనా స్థలం చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని ఎస్సై విజయభాస్కర్ తెలిపారు.



ఘటనా స్థలం వద్ద భాస్కర్‌రెడ్డి, కుటుంబీకులు

ఫోన్ పోతే టెన్షన్ వద్దు

- సత్ఫలితాలనిస్తున్న సీఈఐఆర్ పోర్టల్
- జిల్లాలో ఇప్పటివరకు 2,770 ఫిర్యాదులు
- 343 ఫోన్లను రికవరీ చేసిన పోలీసులు

పటాన్‌చెరుటౌన్ : పోగొట్టుకున్న ఫోన్ ఎక్కడుందో తెలుసుకోవడానికి ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ(సీఈఐఆర్) పోర్టల్ సత్ఫలితాలనిస్తుంది. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 2,770 కేసులు నమోదు అయ్యాయి. ఇందులో 1,140 ట్రేసింగ్‌లో ఉన్నాయి. 343 ఫిర్యాదులకు సంబంధించి బాధితులకు ఫోన్లు అప్పగించారు. 1,323 ఫోన్లను పోలీసులు ట్రేస్ చేయాల్సి ఉంది.

పోర్టల్ నమోదు ఇలా..

ఫోన్ చోరీ జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అనంతరం మీ సేవలో ఫోన్ పోగొట్టుకు న్నట్టు ఐఎంఈఐ నంబర్ ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి. అలాగే, పాత నంబర్‌తో సిమ్ తీసుకోవాలి. దీంతో ఫోన్‌లోని సిమ్ కార్డ్ ఆటోమెటిక్‌గా బ్లాక్ అవుతుంది. అనంతరం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సీఈఐఆర్. జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్ లేదా స్టోలెన్ మొబైల్ లింక్ కనిపిస్తుంది. దీనిపై క్లిక్ చేయాలి పోగొట్టుకున్న ఫోన్ నంబర్, ఐఎంఈఐ నంబర్లు, కంపెనీ పేరు, మోడల్, బిల్లు, ఆధార్ కార్డు, సమాచారం అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన 24 గంటల్లోగా సీఈఐఆర్ పోర్టల్ సిబ్బంది ఆ ఫోన్‌ను బ్లాక్ చేసి పనిచేయకుండా చేస్తారు. దొరికిన వ్యక్తి వేరే సిమ్ వేయగానే పోలీసులకు ఆ నంబర్ డిస్‌ప్లే అవుతుంది. వెంటనే పోలీసులు ఆ నంబర్‌కు ఫోన్ చేసి అది పోగొట్టుకున్న ఫోన్ అని తిరిగి ఇవ్వకుంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరిస్తారు. బాధితుడికి ఫోన్ అందగానే పోర్టల్‌లో అన్‌బ్లాక్ ఫౌండ్ మొబైల్ ఆప్షన్‌లోకి వెళ్లి రిక్వెస్ట్‌ను తొలగించే అవకాశం కూడా ఉంటుంది.



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న సీఐ లాలూ నాయక్, డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి (ఫైల్)

అవగాహన కల్పించాం



సీఈఆర్ పోర్టల్ గురించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాం. ఎవరికైనా సెల్‌ఫోన్ దొరుకితే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి. తక్కువ ధరకు వస్తున్నాయని సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనుగోలు చేయొద్దు. సీఈఐఆర్ పోర్టల్ ఆధారంగా చోరీకి గురైన, పోగొట్టుకున్న ఫోన్లను సులభంగా రికవరీ చేస్తున్నాం.

– బాలాజీ, పటాన్‌చెరు ఇన్‌చార్జి డీఎస్పీ

తెర తీయరా?



మెదక్ కలెక్టరేట్: గతంలోనే ప్రారంభమైన కలెక్టరేట్‌కు సంబంధించిన శిలాఫలకాన్ని ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మూసివేశారు. ప్రస్తుతం ఎన్నికలు పూర్తయ్యి 12 రోజులవుతున్నా శిలాఫలకంపై అతికించిన కాగితాలు తొలగించకపోవడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండల పరిధి గోమారం–సికింద్లాపూర్ రోడ్డుపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి రత్నాపూర్ గ్రామానికి చెందిన బొల్లు మల్లయ్య వీరారెడ్డిపల్లి గ్రామంలో ఉన్న బంధువులు దగ్గరికి వెళ్లేందుకు గోమారంలో బస్సు దిగాడు. అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కొత్తపేట తండాకు చెందిన వ్యక్తి ఎదురుగా బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మల్లయ్య రెండు కాళ్లు విరిగిపోగా, బైక్‌పై ఉన్న వ్యక్తి రోడ్డుపై ఏర్పాటు చేసిన ధాన్యం కుప్పలను ఢీకొట్టాడు. దీంతో అతడికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, సికింద్లాపూర్ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి 108 అంబులెన్స్‌లో తరలించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

బావిలో పడి యువకుడు మృతి



సందీప్(ఫైల్)

జహీరాబాద్: బావిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని అర్జున్‌నాయక్ తండాలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అర్జున్‌నాయక్ తండాకు చెందిన సందీప్(30)కి ఆరు నెలల నుంచి మానసిక పరిస్థితి సక్రమంగా లేదు. సోమవారం తండా శివారులోని వ్యవసాయ బావిలో సందీప్ మృతి చెంది ఉండగా తండావాసులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదుపుతప్పిన బైక్..

కిందపడటంతో వ్యక్తి మృతి



మల్లేశం మృతదేహం

చేగుంట(తూప్రాన్): బైక్ అదుపుతప్పి కిందపడడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కర్నాల్‌పల్లి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట గ్రామానికి చెందిన బక్క మల్లేశం(28) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి కర్నాల్‌పల్లిలో జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లి వస్తున్నాడు. మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి కిందపడడంతో మల్లేశ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేశ్ భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరీశ్ తెలిపారు.

సాహిత్య సేవే పరమావధిగా..

- తండ్రి వారసత్వాన్ని పునికి పుచ్చుకొన్న అన్నాచెల్లెళ్లు
- కవితలు, రచనలో ఎవరికి వారే సాటి..



అవార్డులు, సన్మానాలతో శాస్త్రీ, ఫణీశ

చిన్నకోడూరు(సిద్దిపేట): సాహిత్యాన్ని తమ తండ్రి వారసత్వంగా స్వీకరించి చిన్ననాటి నుంచే సాహిత్య వాతావరణంలో ఒనామలను నేర్చుకొని ఇంతింతై వటుడింతై అన్నట్లుగా గ్రామ పేరును నలుదిశలా విస్తరింపచేశారు అన్నాచెల్లెళ్లు. మండల పరిధిలోని చౌడారం గ్రామానికి చెందిన కవి, తెలుగు ఉపాధ్యాయుడు కటుకోజ్వల ఆనందం సాహిత్యంపై మక్కువ. ఆయన కుమారుడు లాల్‌బహదూర్ శాస్త్రీ, కూతురు ఫణీశ చిన్నప్పటి నుంచి తెలుగులో రాణిస్తున్నారు. సాహిత్యం, కవితలు, పద్యాలపై మక్కువ చూపుతున్నారు. రచనలు, కవిత్వంలో ఎక్కడ పోటీలు జరిగినా అన్నా చెల్లెళ్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవాల్సిందే. దీనికి తోడు కవితలతో ఎక్కడ సమావేశాలు నిర్వహించినా వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొని తెలుగు భాష గొప్పదనాన్ని, కవితల ద్వారా సభలో వినిపించారు. ఈ సందర్భంగా ఇద్దరినీ తెలుగు భాషాభిమానులు ఘనంగా సత్కరించారు. సిద్దిపేటలో ఇటీవల జరిగిన కవుల సన్మాన సభలో మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు కవులు, ప్రముఖులు వీరిని సన్మానించారు.

రెండో వివాహానికి అడ్డుగా ఉందనే..

- భార్యను హత్య చేసిన భర్త
- అనుమానాస్పద కేసును ఛేదించిన పోలీసులు

మిరుదొడ్డి(దుబ్బాక): అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళ కేసును మిరుదొడ్డి పోలీసులు ఛేదించారు. రెండో వివాహానికి అడ్డుగా ఉందన్న నేపంతోనే కట్టుకున్న భార్యను కడతేర్చిన భర్తతోపాటు అందుకు సహకరించిన అత్తమామలను పోలీసులు అరెస్ట్ చేసి కటకటాలకు పంపారు. సోమవారం మిరుదొడ్డి ఎస్‌ఐ నరేశ్‌తో కలిసి గజ్వేల్ ఏసీపీ ఎం.రమేశ్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మిరుదొడ్డికి చెందిన మొగుళ్ల కమలాకర్‌తో వర్గల్ మండలం గుంటిపల్లికి చెందిన బొమ్మలక్ష్మి, చిన్న మల్లయ్య పెద్ద కూతురు పద్మ (22)కి మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో పెద్ద మొత్తంలో కట్న కానుకలను ముట్టజెప్పినప్పటికీ అదనపు కట్నం కోసం భార్యను కమలాకర్ వేధించసాగాడు. అనుకున్న కట్నం పద్మ తేలేదని గ్రహించిన కమలాకర్ రెండో వివాహానికి పూనుకున్నాడు. ఇందుకు భార్యను అడ్డు తొలగించుకోవాలనుకున్నాడు. ఈ క్రమంలో 9వ తేదీన తెల్లవారుజామున పద్మ గొంతు నులిమి చంపేశాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొన్న పోలీసులు భర్తతోపాటు అత్తామామలను విచారించగా నిజం ఒప్పుకున్నారు. వెంటనే వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బస్సు టైరు కింద పడి మహిళ మృతి



భూక్య లక్ష్మి (ఫైల్)

అక్కన్నపేట (హుస్నాబాద్): ఓ ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బస్సు టైరు కింద నలిగి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం బంగారులొద్దితండా వద్ద చోటుచేసుకుంది. ఎస్సై తాండ్ర వివేక్, కథనం ప్రకారం.. అక్కన్నపేట మండలం ముంపు గుడాటిపల్లి గ్రామ పరిధిలోని సోమాజితండాకు చెందిన భూక్య లక్ష్మి(70) కొడుకు, కోడలు సోమవారం ఉదయం హైదరాబాద్ వెళ్తున్నారు. వారిని తన ఇంటి వద్ద హుస్నాబాద్ డిపోకు చెందిన బస్సులో ఎక్కించి మనవడికి డబ్బులు ఇవ్వబోతుండగా.. డ్రైవర్ పతంగి రవీందర్ బస్సును ముందుకు తీసుకెళ్లడంతో ఆమె బస్సు కింద పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న తండావాసులు రామవరం గ్రామ శివారులోని కొండాపూర్ వద్ద బస్సును ఆపి పోలీసులకు అప్పగించారు. డ్రైవర్ రవీందర్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివేక్ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఐదు గేదెలు



మృతి చెందిన గేదెలు

జిన్నారం(పటాన్‌చెరు): విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి చెందిన ఘటన జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత రైతుల కథనం మేరకు.. ఖాజీపల్లి గ్రామానికి చెందిన చిట్ల జగన్, శాగ కృష్ణ, హకీమ్‌కు సంబంధించిన ఐదు గేదెలు సమీపంలోని పంట పొలాల వద్ద మేత మేస్తున్నాయి. అప్పుడే ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తెగిపడటంతో ఐదు గేదెలు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదంతో తాము తీవ్రంగా నష్టపోయామని, అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని, అధికారుల నిర్లక్ష్యంతోనే జరుగుతున్నాయని, ఇందుకు కారణమైన విద్యుత్ అధికారులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.